నిత్య జీవితంలో

# కార్యకారణ సంబంధం

మధిర భానుమూర్తి

మాధవయ్య కొడుక్కి పెళ్ళి నిశ్చయమయింది. ప్రయత్నాలన్నీ చేశారు. కావలసినవాళ్ళ నందరినీ పెళ్ళికి పిలిచారు. ఎరుగున్న వాళ్ళందరికీ శుభలేఖలు పంపారు. ఇళ్ళకి వెల్లలు వేయించారు. ఇంటిముందు పందిళ్ళు వేశారు. బాజాభజంత్రీలు ఏర్పాటుచేశారు. ఇక సరిగ్గా వారంరోజుల్లో పెళ్ళికి తరలివెళ్ళాలి. అంతా ఆ హడావుడిలోనే ఉన్నారు. అలా ఉంటుండగా మాధవయ్యతండ్రి శతవృద్ధు, హఠాత్తుగా కాలం చేశాడు.

ఈ పెళ్ళికి అన్నీ ఏర్పాట్లుఅయి శుభకార్యం ఇంక వారం రోజుల్లో ఉందనగా ఆ ముసలాయన కన్ను మూశాడనేగాని, లేకపోతే ఈ జరిగిన దాంట్లో అంత ఆశ్చర్యం ఏమీలేదు. అదీకాక ముసలాయనకు రెండుమూడు నెలలుగా బాగా అస్వస్థగానే ఉంది. మంచం దిగటంలేదు. ఇంకా పరిస్థితి విషమించకుండానే కుర్రాడికి పెళ్ళి చేయిస్తే ముసలాయన చూసినట్టూ అవుతుంది. పిల్లాడి తలమీద నాలుగు అక్షింత గింజలు వేస్తాడు అనే ఉద్దేశంతోనే అసలు వివాహం అంత త్వరగా ఏర్పాటుచేశాడు మాధవయ్య. అయితేనేం?...మాట దక్కలేదు.

ఈవార్త క్షణంలో ఊరంతా పొక్కింది. ఏవీధిని చూసినా దీన్నిగురించి మాట్లాడుకునే వాళ్ళే ఈ విషయంలో ఆరోజున చూపినంత ఆసక్తి ఆఊరి ప్రజలు మరొక విషయంలో దేంట్లోనూ మరేనాడు చూపించుండరు.

"ఆయనకేం! అదృష్టవంతుడు శతవృద్ధాయె! పండిన పండు రాల కేమవుతుంది!" అన్నాడు పోయిన ఆయనకు సమవయస్కుడొకాయన.

"అవునుకోండి! కాని బొత్తిగా కార్యం వారంరోజులనగా పోయాడు. ఈవారం ఎలాగో గడిచి ఉంటే చూడండి పాపం! ఎంతకష్టంగా ఉంటుందో వాళ్ళకి వీళ్ళకీ కూడా. అయినా మన చేతుల్లో ఏమీలేదు" అన్నాడు మరొకఆయన.

"ఆయనస్థితి అలా ఉందని తెలిసికూడా తొందరపడి ముహూర్తం పెట్టకూడదు కొంచెం ఓపిక పట్టవలసింది." అన్నాడు ఈ మధ్యనే మాధవయ్యతో మాటలు చెడిన మరో ఆసామీ.

"ఇవన్నీ చెప్పివస్తాయేమిటండీ!...ఏదో రెండు నెలల్నించి ఇలాగఉన్నాడు మరో నెలజరగదా అనుకున్నారుగాని...వాళ్ళకి మాత్రం ఏం తెలుసును చెప్పండి తెలిస్తే ఇలా ఎందుకు పెట్టుకుంటారు?" అన్నాడు మాధవయ్య దగ్గిర స్నేహితుడు.

"ఏమిటో ఆ పరమాత్ముడు సరిగ్గా చూడలేదు గనక గాని ఈ వారం రోజులు గడిస్తే గట్టెక్కిపోదురు గదా! ఇంతకీ..." అని కళ్ళల్లో నీళ్ళు నింపాడు ఇంకొకడు.

అక్కడ జేరిన మగవాళ్ళంతా ఇలా తలోకరు తలోకమాట అంటుంటే అక్కడ జేరిన మహిళలు కూడా యథాశక్తి తమకి తోచిన మాటలు తాము అన్నారు.

"వీటన్నింటికేంగాని పిన్నీ? నే చెప్తా విను ఆ తల్లికాలు ఎలాంటిదోగాని ఈ సంబంధం వచ్చిన పుటినుంచే ముసలాయన మంచం ఎక్కాడు. అక్కడనుంచి నానాటికి క్షీణించుకుపోయి చివరకు ఇలా అయింది. ఆ చల్లని తల్లి(పెళ్ళికూతురు) ఇంటికి రాకుండానే, ముసలాయనని సాగనంపింది. ఇంట్లోకివస్తే యింకా ఎన్ని జరుగుతాయో! ఏమోనమ్మా! నాకు ఆనాడే అనిపించింది ఈ సంబంధం వద్దని అయినా మనమెవరం? వారికి ఇష్టమైతే వారు చేసుకుంటారు. లేకపోతే లేదు మనం చెప్తే మనమాట వింటారా?..." అంది సరస్వతమ్మగారు.

"నిజమేనండి!...పెళ్ళిఅయిన ఏడూ, పెద్దలు పోయిన ఏడూ' అన్నారు ఇంకా పెళ్ళి అవక ముందే ఇంత జరిగింది ముందు ముందు ఇంకా ఎంత జరుగుతుందో! అయినా ఒక్కొక్క మహాతల్లి మాట అనుకుంటేనే మహాపాపం! ఆవిడని

తల్చుకుంటే అన్నం పుట్టదు..." అంది సుభద్ర.

"సుభద్ర అంది అనుకోవడం ఎందుకమ్మా! నిజమేగా!...ఎవరెరుగరు? పెళ్ళి స్థిరపడి, అన్నీ సిద్ధమయి ఉండగా ఆ అమ్మాయి ప్రభావం కాకపోతే ఇంకేమిటి?...చెప్పు!" అని గదమాయించింది సరస్వతమ్మ.

"ఇది ఇంతటితో వదులుతుందా? చావు మారుకోరుతుంది...ఇంకా ఎవరెవరిని ఏంచేస్తుందో... అదిచూడండి. పోయింది ముసలాయన. ఆయనకోసం మనం అంత బాధపడక్కర్లేదు..." అని ముక్తాయింపుగా మాట్లాడింది కాంతమ్మ.

ఏదేనా ఒక సంఘటన జరిగితే దానిమీద పదిమందీ పది విధాలుగా మాట్లాడడం మనం తరుచు చూస్తున్నాం. వీరంతా ఆ విషయం అలా జరగడానికి కారణమేమిటో తీవ్రంగా పరిశీలించి కనుక్కుంటారు. వారికి ఆ కారణాల ఆచూకీ తెలియకపోతే ఏదో ఒకకారణం ఊహించి తీరుతారు. గాని వదలరు. అందులోనూ ఒక వివాహం అయాకగాని, స్థిరపడ్డాకగాని, ఎవరేనా ఒకరు పోయాకగాని ఏదేనా అశుభమో, కష్టమో కలిగితే దానికి దీనికి ముడిపెట్టడం మానవసహజం. అది ఎంతవరకూ సమంజసంగా ఉంటుంది అని ఆలోచించరు వారు. నిజానికి పై కథలో ఎవరికీ ఆ పోయినవ్యక్తి ముసలాడు గనక పోయాడు అని అనిపించలేదు. ఇంకా ఈ ఇంటినిగాని ముసలాయన్నిగాని ఒక్కసారైనా చూడని ఆ పిల్లవల్ల ఇదంతా జరిగిందనడంలో ఏం వివేకముంది?

ఇలాంటివి ఒకరకంగా మాత్రమే ఉపకరిస్తాయి. మాధవయ్యలాంటివాళ్ళు మరణశయ్యమీద ఒక మనిషిని ఇంట్లో పెట్టుకుని శుభముహూర్తం పెట్టుకు వచ్చాడని పదిమందీ అంటారని భయపడితే వారి బారినుండి తప్పించుకుందుకు ఏమీ ఎరగని వారి మీద ఈ అభాండం వేసి నిశ్చింతంగా విశ్రమించవచ్చును. అదైనా అన్నప్పుడూ జరగదు. కాని తప్పు మరొకరిమీదవేస్తే తమ బాధ్యత తీరుతుంది. తమకి తృప్తిగా ఉంటుంది.

ఆ మాటకివస్తే ప్రతిదానికి కారణం అంటూ ఉండదు. ఉన్నా అది పదిమందీ అనుకునేది మాత్రం కాదు. పదిమందీ అనుకునేది ఒకవేళ నిజంగా కారణమే అయినా అది కేవలం ఆనాడు ప్రస్ఫుటంగా కనిపించే కారణమే అవుతుందిగాని, అంతకుముందు ఎన్నో కారణాలు ఉండి, అవన్నీ తీవ్రంగా పనిచేస్తేనేగాని అది జరిగే ఉండదు.

చరిత్రని పరిశీలిస్తే ఈ సత్యం మనకు బాగా గోచరిస్తుంది. యుద్ధాలు జరగటానికి కారణాలు ఎన్నో ఉన్నప్పటికీ చివరకి యుద్ధం మొదలుపెట్టడానికి ఏదైతే కారణమవుతుందో అదే ముఖ్యమైనదిగా అందరికీ కనిపిస్తుంది.

సోమయ్యగారు ఇల్లు కట్టుకున్న సంవత్సరం లోపుగా ఆయన ఏదో ప్రమాదంలో చిక్కుకుని మరణించాడు. అప్పుడు అందరూ జేరి ఆయన—నిక్షేపంలాంటి కొంప కట్టుకున్న సోమయ్య, ఏనాడూ ఎవరికీ అపకారంచేసి ఎరుగని సోమయ్య ఎందుకు పోయాడో అని సభచేసి కారణాలన్వేషించారు. ఎవరికి తోచిన రీతిని వాళ్ళు చెబుతున్నారు. ఇంతలో ఒక సిద్ధాంతిగారు లేచి సోమయ్యగారి జాతకానికి ఈ యిల్లు వాస్తుశాస్త్ర ప్రకారం పనికిరాదని, ఆయనకు సంప్రాప్తించిన ఈ మరణం శాస్త్ర సమ్మతమేననీ సిద్ధాంతీకరించారు. ఆ సిద్ధాంతిగారు సోమయ్యగారి నూతన గృహ ప్రవేశ సందర్భంలో ఇల్లు సలక్షణంగా ఉన్నదని చెప్పి పదిరూపాయల నోటు పారితోషికంగా స్వీకరించినవాడే!... ఇదంతా విని ఖంగారుపడ్డ సోమయ్య భార్య మరో సిద్ధాంతిగారికి చూపిస్తే ఆ ఇంటివల్ల యజమానికి లాభమూలేదు, నష్టమూ లేదని చెప్పాడట. కాని ఎంత నచ్చచెప్పినా ఈ విషయం సోమయ్య భార్యకి నమ్మకంగా కనిపించలేదు.

మావాడొకడు కొంచెం పనిమీద ఊరువెడుతుంటే పొరుగింటి ఆయన "ఎక్కడికో వెడుతున్నట్టున్నారే!" అని అడిగాడు. అలా అడగటం ఆయనకేమీ కొత్తకాదు. అంతేకాదు; ఆయన ఎక్కడికేనా బయలుదేరితే మావాడు కూడా అలాగే అడుగుతాడు. ఇది వాళ్ళిద్దరి నిత్యకృత్యాల్లో భాగమే. అయితేనేం?....అవాళ మావాడు వెళ్ళినచోట పనికాలేదట! అంతే... అక్కడినుండి చరచరా నడుస్తూ వచ్చి ఆ పొరుగింటి ఆయనమీద తనకున్న కోపం అంతా నా దగ్గిర వెళ్ళగ్రక్కాడు. నేనేం చెయ్యాను?...వాడు

(తరువాయి 43-వ పేజీలో)